క్లుప్తంగా


భ్రమరాంబాదేవికి ఊయలసేవ



స్వామి అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్నబ అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం అమ్మవారి మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. శ్రీశైలంలోని అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన సుంకులా పరమేశ్వరి దేవి విగ్రహం

కొత్తపల్లి: మండలంలోని బట్టువారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులాపరమేశ్వరి, పోతురాజు సహిత నాభిశిల విగ్రహ ప్రతిష్ట శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు ఉదయం ప్రభాతపూజ, గణపతి పూజ, విగ్రహాలకు, యంత్రాలకు అభిషేకం, కర్పూరహారతి తదితర పూజాకార్యక్రమాలను వేదపండితులు నిర్వహించి యంత్ర, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను పూర్తి చేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌గా పద్మావతి

బండిఆత్మకూరు: తహసీల్దార్‌గా పద్మావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆమె ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేస్తుండగా జిల్లా అధికారులు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

బీమా చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలానికి చెందిన కుంచపు జయప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా కింద రూ.2 లక్షల చెక్కును శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ కె.సుబ్రహ్మణ్యం అందజేశారు. కార్యక్రమంలో మృతుని భార్య కుమారి, అసిస్టెంట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, క్యాషియర్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హెచ్ఎం మధుసూదన్‌రావు

పగిడ్యాల: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ మెగా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేడు పర్వదినం
- ప్రార్థనలకు ఈద్గాల ముస్తాబు

బండి ఆత్మకూరు: ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ఈ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. పవిత్ర త్యాగానికి ప్రతి రూపమైన దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీమ్ అలహీః సలాతుసలామ్ అల్లాహ్ ప్రసన్నం కోసం చేసిన మహోన్నత త్యాగాన్ని ఈ సందర్భంగా ముస్లింలు స్మరించుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ అద్‌హాః (బక్రీద్). శనివారం నిర్వహించుకోనున్న బక్రీద్‌కు ఈద్గాలను ముస్తాబు చేశారు.

ఖుర్బానీకి ప్రాధాన్యం

దేశ వ్యాప్తంగా ముస్లింలు శనివారం బక్రీద్‌ను జరుపుకోనున్నారు. ఇందులో భాగంగా ఖుర్బానీ ఇవ్వడం అత్యంత పవిత్రమైన కార్యక్రమంగా భావిస్తారు. ఒక గొర్రె పొట్టేలు మాంసాన్ని మూడు భాగాలుగా చేస్తారు. ఒక భాగాన్ని నిరుపేదలకు పంచి పెడతారు. మిగిలిన భాగాల్లో రెండో భాగాన్ని బంధువులకు, మూడో భాగం తమ కోసం ఉంచుకుంటారు. దీన్నే ఖుర్బానీ అంటారు. ముస్లింలు ఈ మాసంలోనే హజ్ యాత్ర చేపడతారు. పవిత్ర మక్కాను సందర్శించడానికి వెళ్తారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలోని మస్జిద్ అల్ హరామ్‌లోని కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణలు చేస్తారు. బక్రీద్ రోజు ముస్లింలు అందరూ ఈద్గాకు చేరుకుని సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు.

సందడి షురూ..

మార్కెట్లో బక్రీద్ సందడి మొదలైంది. పొట్టేళ్లు, గొర్రెలు, మేకల విక్రయాలు, కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఖుర్బానీ ఇవ్వడం కోసం ఇప్పటికే కొందరు కొనుగోలుదారులు ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా పొట్టేళ్లను కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మరి కొందరు తమ దగ్గరిలోని గోకవరం, ఇలపల్లి తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఖుర్బానీ కోసం సిద్ధం చేసుకున్నారు. స్థానికంగా కొందరు వ్యాపారులు ఏడాది పొడవునా పొట్టేళ్లను పెంచి విక్రయిస్తుంటారు. ఒక్కో పొట్టేలు రూ.8 వేల నుంచి రూ.22 వరకూ పలుకుతోందని వ్యాపారులు చెబుతున్నారు. బక్రీద్ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొట్టేళ్ల వ్యాపారం జరుగుతుందని అంచనా.



ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా

పొట్టేళ్లకు గిరాకీ

బక్రీద్ వస్తుందంటే పొట్టేళ్లకు గిరాకీ ఏర్పడుతుంది. వారం రోజుల నుంచే కొత్త బట్టలు, పండగ సామగ్రి కొనుగోలు చేస్తారు. ఖుర్బానీ ఇవ్వడానికి గొర్రెలు, మేకలను దూరప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. పండగ తరువాత కూడా నెల మొత్తం ఖుర్బానీ ఇచ్చే అవకాశం ఉంది.

త్యాగనిరతి



బక్రీద్ మనిషికి దైవభీతి, త్యాగనిరతిని తెలియజేస్తుంది. అందుకే దీనిని త్యాగాల పండుగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తుచేసుకుని వారి పేరున ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ ప్రత్యేకత.

– షరీఫ్, బండిఆత్మకూరు

ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ



బక్రీద్ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇచ్చి పేదలకు పంచడం ఆనవాయితీ. ముస్లింలు తమ జీవితకాలంలో ఒక్క సారైనా అతి పవిత్రమైన మక్కాను సందర్శించి ముక్తిని పొందాలి.

– సలీం మౌలానా రషాదీ, మసీదు ఇమామ్, సంతజూటూరు

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి

వెలుగోడు: బక్రీద్ సందర్భంగా పట్టణంలోని ఈద్ ఉల్ అధా నమాజ్‌లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉస్మానియా ముస్లిం అంజుమాన్ కమిటీ సభ్యులు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఉదయం 8:30 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముస్లింలు ఉదయం 7:30 గంటలకు వెలుగోడు ఈద్గా వద్దకు రావాలని వారు కోరారు.

పంచాయతీ ఆదాయం పెంపునకు కృషి

వెలుగోడు: స్థానిక మేజర్ పంచాయతీలో ఆదాయం పెంపునకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వేల్పుల జయపాల్ తెలిపారు. మేజర్ పంచాయతీ నిధులతో పాతబస్టాండ్‌లో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ పనులను శుక్రవారం సర్పంచ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ నిధులతో నాలుగు గదులను నిర్మిస్తున్నామన్నారు. వాటిని వాణిజ్య అవసరాల నిమిత్తం బాడుగకు ఇచ్చి పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుతామన్నారు.

14న ఆలయాల భూముల వేలంపాటలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కడమల కాలువ గ్రామంలోని పలు ఆలయ భూములకు ఈనెల 14న వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రూపు దేవస్థానముల ఈఓ నాగప్రసాద్ శుక్రవారం తెలిపారు. శివనంది దేవస్థానముకు సంబంధించిన 27.97 ఎకరాల భూమికి, చెన్నకేశవస్వామి దేవస్థానమునకు చెందిన 35.12, వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 4, భైరవ స్వామి దేవస్థానానికి చెందిన 10 ఎకరాల భూములకు ఈనెల 14న వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్బి వెంకటస్వామి

నందికొట్కూరు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పారిశ్రామిక వేత్తలుగా ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మిడుతూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లబ్బి మాట్లాడుతూ నాలుగు వేల ఎకరాల భూములు ఖనిజ సంపదతో నిండి ఉన్నాయన్నారు. ఖనిజ సంపద కలిగిన భూములకు కూటమి ప్రభుత్వం భారత్ సిందూర్ పారిశ్రామిక వాడగా నామకరణం చేయాలని ఆయన కోరారు. 2009–14 మధ్య కాలంలో ఏపీఐఐసీ ద్వారా సర్వే చేసినట్లు చెప్పారు. కలమందలపాడు చెరువును మల్యాల హంద్రీనీవా కాలువ నుంచి సాగు, తాగునీరు కోసం ఒక టీఎంసీ నీటిని నింపాలని డిమాండ్ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ నీటిని అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, కుప్పం వరకు తరలిస్తున్న అధికారులు హంద్రీనీవా కాలువ ప్రారంభమవుతున్న నందికొట్కూరు నియోజకవర్గానికి సాగు, తాగునీరు ఇవ్వకుండా మోసం చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో సర్పంచులు వెంకటేశ్వర్లు, జీవరత్నం, ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి



ఉపాధి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

నందికొట్కూరు: ఉపాధి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తే కార్యాలయం ముట్టడిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామ పొలిమేరలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేయడం దారుణమన్నారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రఘునాథ్, విజయకుమార్, రాంబాబు, కృష్ణయ్య, గొల్ల శ్రీరాములు, సలీంబాషా, లింగం, యశోదమ్మ, అంజనమ్మ, లక్ష్మీదేవి, మహేష్, పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి

పగిడ్యాల: వ్యవసాయ అనుబంధ రంగాలు పశుపోషణ, ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయాన్ని పొందవచ్చని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మి సూచించారు. శుక్రవారం సంకిరేణిపల్లె, పగిడ్యాల గ్రామాల్లోని సచివాలయాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందించే రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూసారా ఆధారిత ఎరువుల యాజమాన్యం, విత్తన శుద్ధి, పంట మార్పిడి పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. మొక్కజొన్నలో అంతర పంటగా కంది, వరిలో సస్యరక్షణ చర్యలైన విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్, వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



భరత్ | లీలేశ్వర ఆచారి | అమానుల్లా | దరణేశ్వరగౌడు | శ్లోక | పల్లవి

- ఎన్ఎంఎంఎస్‌కు 11 మంది విద్యార్థులు ఎంపిక

పాములపాడు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరవీంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అత్యధికంగా తమ స్కూల్ నుంచి 11 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు ఏటా రూ.12,000 చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తుందన్నారు.



ప్రణతి | నాగేశ్వరరావు | కార్తికేయాచారి | రోహిత్ | మణిచరణ్ తేజ

'యోగాంధ్ర'కు తరలిరావాలి

నందికొట్కూరు: ఈనెల 9న మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించనున్న యోగా అవగాహన ర్యాలీకి తరలి రావాలని మున్సిపల్ కమిషనర్ బేబి కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యోగాతో రోగాలు దూరమవుతాయన్నారు. ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

- పగిడ్యాల: ఈనెల 9న మండలంలో యోగాంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ శుక్రవారం తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి ర్యాలీ చేపట్టి విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

మహానందిలో నేడు..

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం యోగాంధ్ర బెలూన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహబూబ్ దౌలా, మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, ఏఈఓ మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, ఎం.నీలకంఠరాజు పాల్గొన్నారు.

9న మంత్రి ఆనం రాక

మహానంది: ఈనెల 9న రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మహానందికి రానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మహానంది దేవస్థానం ప్రాంగణంలో టీటీడీ నిధులతో నూతనంగా నిర్మించిన వసతిగృహాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు 55 వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ, తమ్మడపల్లె గ్రామంలోని మహానంది దత్తత దేవాలయం కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

రైతులకు రాయితీ పరికరాల పంపిణీ

జూపాడుబంగ్లా: వ్యవసాయంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం తంగడంచ రైతుసేవా కేంద్రం పరిధిలోని రైతులకు రాయితీ వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరెడ్డి, వీహెచ్ఏ వెంకటేష్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ లక్ష్యాన్ని చేరుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): పీఎం సూర్యఘర్ లక్ష్యాన్ని అధికారులు చేరుకోవాలని జిల్లా నోడల్ ఆఫీసర్, చీఫ్ ఇంజినీర్ ఆదిశేషయ్య అన్నారు. శుక్రవారం పీజీ కళాశాలలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పతకంపై విద్యుత్ అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందన్నారు. ప్రతి నియోజకవర్గంలో పదివేల గృహాలకు సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్స్ ప్యానల్స్ బిగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సుధాకర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి వృక్షాలే జీవనాధారం



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పర్యావరణ పరిరక్షణలో అత్యంత ముఖ్యమైనవి వృక్ష సంపదేనని, వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జంతు జీవరాశులతోపాటు మానవ మనుగడ అసాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. ఆత్మకూరు పట్టణంలో 5 వేలకు పైగా మొక్కలను నాటి పచ్చదనాన్ని మెరుగు పరుస్తామన్నారు.

ప్రతి అధికారి మొక్క నాటాలి

జూపాడుబంగ్లా: ప్రతి అధికారి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఓ మొక్కను నాటి సంరక్షించాలని సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం జూపాడుబంగ్లాలోని 80బన్నూరు సహకార సొసైటీ కార్యాలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషిచేయాలన్నారు. తాటిపాడు సచివాలయం వద్ద ఏపీఎం అంబమ్మ, సచివాలయ ఉద్యోగులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణారెడ్డి, సొసైటీ సీఈఓ చంద్రశేఖర్‌గౌడు, సొసైటీ మేనేజర్, చైర్మన్ వెంకటరమణ, నందికొట్కూరు బ్యాంకు సూపర్‌వైజర్ చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

మహానందీశుడి పల్లకోత్సవం



పల్లకీసేవ జరుగుతున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు స్థానిక అలంకార మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మంగళ హారతులు, బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం సాగింది. భక్తులు ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

'ఆధార్' అవస్థలు



సచివాలయం-2 వద్ద వేచి ఉన్న ప్రజలు

వెలుగోడు: ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలోని 2వ వార్డు సచివాలయం, వేల్పనూరు, గుంతకందాల, బోయరేవుల సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. శుక్రవారం పట్టణానికి చెందిన పలువురు చంటి పిల్లలతో కలిసి వెలుగోడు సచివాలయం-2 వద్దకు వచ్చారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఒకే ఒక ఆధార్ సెంటర్ నడుస్తోంది. ప్రతిరోజూ 20 నుంచి 30 ఆధార్ కార్డులు చూడడమే గగనంగా మారింది. దీంతో గత్యంతరం లేక వృద్ధులు, చంటి పిల్లలతో ప్రతి రోజూ సచివాలయం-2 వద్దకు వచ్చి పడిగాపులు కాయడం వెనుదిరగడం షరామామూలైంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని పట్టణంలో మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభా పురస్కారాలకు 'నంది' విద్యార్థులు



ఎస్ఎండీ అఖిల్, ఎస్. సుహానాబేగం, పీ. మేఘన, ఎం నవీన్

నందికొట్కూరు: తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు నంది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బద్దుల శ్రీకాంత్ తెలిపారు. పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులు ఎస్ఎండీ అఖిల్, ఎస్. సుహానా బేగం, పీ. మేఘన, ఎం.నవీన్‌లను శుక్రవారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ అభినందించారు. ఇంటర్‌లో అధిక మార్కులు సాధించి కళాశాలకు గుర్తింపు తెచ్చారన్నారు. భవిష్యత్తులో లక్ష్యసాధనకు తగిన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్‌రావు, రమణ, శివశంకర్, కోటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10న కొత్తపల్లి, ఎర్రమఠం, 11న గువ్వలకుంట్ల, ముసలిమడుగు, 12న దుద్యాల, ముసలిమడుగు, 13న నందికుంట, గోకవరం గ్రామాల సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామాల ప్రజలు ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయించుకోవాల్సిన వారు సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు.



ప్రమాదకరంగా అండర్‌పాస్ వంతెన



పెచ్చులూడిన వంతెన ప్రాంతాన్ని చూపుతున్న కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి

పాములపాడు: ఎన్‌హెచ్340సీ నిర్మాణంలో భాగంగా చేపట్టిన అండర్‌పాస్ వంతెన ప్రమాదకరంగా ఉందని కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన వంతెనను పరిశీలించి మాట్లా డారు. నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి వంతెన ఎత్తు తక్కువగా ఉందని చెబుతున్నా నిర్వాహకులు పట్టించుకోలేదన్నారు. ట్రాలీపై హిటాచి మిషన్ వెళ్లే సమయంలో ఎత్తు సరిపోకపోవడంతో పెచ్చులూడి వంతెన స్లాబు పైభాగంలో గీతలు పడ్డాయన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. భవిష్యత్తులో ఈ రహదారిలో నిత్యం మొక్కజొన్న కోత మిషన్లు, బావుల తవ్వకానికి హిటాచీ మిషన్ల రాకపోకలు సర్వసాధారణమన్నారు. ఇలాగే కొనసాగితే వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కోవడమే గాకుండా వంతెనకు ముప్పు వాటిల్లుతుందన్నారు. అధికారులు వంతెనను పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: ఎన్‌హెచ్ 340సీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యు), సీపీఐ (ఎంఎల్) జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు తాటిపాడు గ్రామ సమీపంలో పగుళ్లిచ్చిన వంతెనను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో సుద్దబిలుకును ఉపయోగించారన్నారు. గార్గేయపురం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి కుంగిపోయిందన్నారు. నాగలూటి, తర్తూరు, పారుమంచాల, మండ్లెం తదితర గ్రామాల వద్ద అండర్‌పాస్ వంతెనలు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విజిలెన్స్, సీఐడీతో దర్యాప్తు చేయించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.